సాక్షి వికారాబాద్

గురువారం। 2। నవంబర్। 2023



వికారా'బాద్‌షా'లు

వికారాబాద్ నియోజకవర్గం 1952లో ఏర్పడగా.. మర్రి వంశానికి రాజకీయ బీజాలు ఇక్కడ నుంచే మొదలయ్యాయి. 10లో▸



పైలెట్‌కే మా మద్దతు

వచ్చే ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికే మా మద్దతు అని బీసీ సంఘం జాతీయ నేత రాజ్‌కుమార్ అన్నారు. 11లో▸



కిడ్నాప్ కథ సుఖాంతం

వికారాబాద్‌లో కిడ్నాప్‌కు గురైన చిన్నారి కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించి తల్లికి అప్పగించారు. 11లో▸

న్యూస్‌రీల్

ఘాటెక్కిన ఉల్లి

అమాంతం పెరిగిన ధర



దౌల్తాబాద్: ఉల్లి ధర అమాంతం పెరిగిపోయింది. నెల రోజుల క్రితం కిలో ఉల్లి ధర రూ. 20 నుంచి రూ. 25 వరకు ఉండేది. దసరా పండుగకు ముందు కిలో రూ. 40నుంచి రూ. 45కి విక్రయించారు. ప్రస్తుతం కిలో తెల్ల ఉల్లి రూ. 80 కాగా ఎర్ర ఉల్లి రూ.70 పలుకుతోంది. ధర అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. సూపర్ మార్కెట్లలో కిలోపై అదనంగా 10 రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు. డిసెంబర్ 15వ తేదీ వరకు వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు ఉండడంతో ఉల్లి ధర మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. టమాటా ధర కూడా పెరుగుతూ వస్తోంది. దసరా పండుగకు ముందు కిలో టమాటా రూ. 20 కాగా ప్రస్తుతం కిలో రూ.40కి పెరిగింది. టమాటా ధర మళ్లీ పెరగడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థి



జానకీరాం

కుల్కచర్ల: రెండు నెలల క్రితం నగరంలో జరిగిన ఖోఖో పోటీల్లో గిరిజన గురుకుల విద్యార్థి సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కుల్కచర్ల గురుకుల కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి. జానకీరాం హైదరాబాద్‌లో జరిగిన ఖోఖో పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. త్వరలో గోవా రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్



మరికల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మారుతి కిరణ్ తదితరులు

కుల్కచర్ల: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూనేటీ మారుతి కిరణ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చౌడాపూర్ మండలం కల్మన్‌కల్వ, మరికల్, బంగరంపల్లి, తంగడిపల్లి, కిష్టంపల్లి, చాకల్‌పల్లి గ్రామాల్లో కార్యకర్తలతో కలసి ర్యాలీ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగిలో బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని, ఇందుకోసం తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి కుటుంబ పాలన సాగుతోందని, ఈ తరహా పాలనకు చెక్ పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీ బందయ్య, సీనియర్ నాయకులు మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభ్యర్థి నచ్చలేదా.. నోటా.. నొక్కు



2013 నుంచి అమలులోకి..

- 2018 ఎన్నికల్లో జిల్లాలో నోటాకు ఐదు వేల పైచిలుకు ఓట్లు
- మరింత అవగాహన కల్పించాలంటున్న యువత

వికారాబాద్ అర్బన్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అవకాశం ఉంది. పదేళ్ల క్రితం కేంద్ర ఎన్నికల సంఘం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే ఇలాంటి అవకాశం ఉందనే విషయం చాలామంది ఓటర్లకు తెలియదు. అభివృద్ధి చెందిన దేశాల్లో నోటా ఎప్పటినుంచో అమలులో ఉన్నా మన దేశంలో మాత్రం 2013లో అమలులోకి వచ్చింది.

ఈవీఎంల రాకతో..

ఈవీఎంల రాకతో నోటా ఉపయోగం తేలికగా మారింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల గుర్తుతో పాటు నోటా బటన్ ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఓటు వేయాలంటే సదరు అభ్యర్థికి, పార్టీలకు ఓ గుర్తు ఉంటుంది. అయితే పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికీ నేను ఓటు వేయడం లేదు అనే ఆప్షన్‌ను ఈవీఎంలలో పొందుపరిచారు. ఆ బటన్ నొక్కితే ఆ ఓటు ఎవరికి పడదు. కానీ ఓటు హక్కు వినియోగించుకున్నట్లే.

2009లోనే నోటా ప్రస్తావన

నోటాను అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఎన్నికల కమిషన్ 2009లో తొలిసారిగా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించినా పౌరహక్కుల సంస్థ పీయూపీఎల్ దీనికి మద్దతుగా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీంతో నోటాను అమల్లోకి తేవాలంటూ సుప్రీంకోర్టు 2013 సెప్టెంబర్ 27న ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు ఓటర్లకు ఇష్టం ఉన్నా లేకున్నా ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సి వచ్చేది. నోటా అమల్లోకి రావడంతో అభ్యర్థులు నచ్చకపోతే అదే విషయాన్ని నోటా ద్వారా తెలియజేసే అవకాశం లభించింది. ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో నిలబడిన అభ్యర్థులకు పడిన ఓట్ల కంటే నోటాకు ఎక్కువ పోలైతే ఆ నియోజకవర్గానికి తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

అవగాహన కల్పించాలి

నోటా అనే ఒక సదుపాయం ఉన్న విషయం చాలా మందికి తెలియదు. పట్టణాల్లో కొంత మేర అవగాహన ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో నోటా గురించి పెద్దగా తెలియదు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోయినా ఎవరో ఒకరికి ఓటు వేస్తున్నారు. నోటాపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని యువకులు కోరుతున్నారు. నోటా ఉందనే విషయం తెలిసేలా ఏదైనా గుర్తు కేటాయిస్తే బాగుంటుందని ప్రముఖ రచయిత సౌదా అరుణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు నోటాకు గుర్తు కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది.

జిల్లాలో ఇలా..

2018 శాసనసభ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలో నోటాకు 5,147 ఓట్లు పడ్డాయి. వికారాబాద్ నియోజకవర్గంలో 1,511 ఓట్లు, తాండూరు నియోజకవర్గంలో 787, పరిగి నియోజక వర్గంలో 1,381, కొడంగల్‌లో 1,468 ఓట్లు నోటాకు పడ్డాయి.

ఐదు దశాబ్దాల క్రితమే..

అమెరికా, ఫ్రాన్స్, బెల్జియం, బ్రెజిల్, గ్రీస్, రష్యా వంటి దేశాల్లో ఐదు దశాబ్దాల క్రితమే నోటా అమల్లోకి వచ్చింది. కాలిఫోర్నియాలోని శాంతా బార్బర్ కౌంటి ఎన్నికల్లో 1976లో తొలిసారిగా నోటా విధానాన్ని ప్రవేశపెట్టారు. నిజానికి అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే హక్కును భారత రాజ్యాంగం మనకు ఎప్పుడో కల్పించింది. ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని 49 ఓ సెక్షన్ కింద ఓటర్లు ఈ హక్కును ఉపయోగించుకునే వీలుంది. పోలింగ్ బూత్‌లోని ఎన్నికల అధికారి వద్దకు వెళ్లి దీని కోసం 17 ఏ ఫాంను తీసుకొని ఫలానా అభ్యర్థిని తిరస్కరిస్తున్నట్లు పేర్కొంటూ సంతకం లేదా వేలిముద్ర వేసి బ్యాలెట్ బాక్సులో వేయవచ్చు. ఇది రహస్య బ్యాలెట్ విధానానికి విరుద్ధమైనదని, ఓటరు భద్రత దృష్ట్యా ఇది మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. అయితే అప్పట్లో చాలామంది ఓటర్లకు దీనిపై అవగాహన ఉండేది కాదు. ఈవీఎంలు వాడుకలోకి రావడంతో ఎన్నికల కమిషన్ చొరవ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో నోటా అందుబాటులోకి వచ్చింది. దీనిపై విస్తృత ప్రచారం జరగడంతో 2013లో ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బాధ్యతగా పని చేయండి

ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేసి పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఈ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ పంపిణీ చేసిన బుక్‌లోని అంశాలను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని తెలుసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనీలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయడంతో పాటు పోలింగ్ వసతులను సమకూర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ మోడల్ ఆఫీసర్ చక్రపాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి

నవంబరు 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకోసం ఆర్వో కార్యాలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థి వెంట ఐదుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించాలని ఆదేశించారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఆర్వో కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రచార వాహనాలకు ఆడియో సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోని సమీకృత కంట్రోల్ రూమ్‌లలో సీ విజిల్, సువిధ, కాల్ సెంటర్, ఎంసీఎంసీ సోషల్ మీడియా పర్యవేక్షణను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ నెల 8లోగా ఫామ్ 6, ఫామ్ 8 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. 12వ తేదీ నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీని ప్రారంభించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది నుంచి పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12 దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. ఎలాంటి తప్పులు జరగకుండా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని, రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని ఆదేశించారు.



పరిగిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

ఆదరించండి అండగా ఉంటా

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- పరిగిలో ఎన్నికల ప్రచారం

పరిగి: ప్రస్తుత ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆదరిస్తే అండగా ఉంటానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి 3వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ తరహా అభివృద్ధి ఎక్కడా సాధ్యం కాలేదన్నారు. పలు రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకున్నాయని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యాయని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మనమే ఆదర్శమన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, ప్రస్తుత ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. అనంతరం రుకుంపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, కౌన్సిలర్లు అర్చన, కిరణ్, వెంకటేష్, కృష్ణ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మౌలానా, రవికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నారీ.. ఏరీ..?



- టికెట్ల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వని రాజకీయ పార్టీలు
- అన్ని పార్టీలదీ అదే తీరు
- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- 1952 నుంచి ఇప్పటి వరకు ఒకే ఒక్క మహిళా ఎమ్మెల్యే
- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,34,523
- పురుషులు 4,64,822
- మహిళలు 4,69,659

వికారాబాద్: 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి, శయనేషు రంభ, భోజ్యేషు మాతా, క్షమయా ధరిత్రి' అంటూ మహిళల ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని అనాదిగా తెలియజేస్తూ వస్తున్నారు. అయితే రాజకీయ పార్టీలు మాత్రం చట్టసభల్లో సరైన ప్రాధాన్యత కల్పించడం లేదు. ఇటీవల చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినా అమల్లోకి వచ్చేది వచ్చే ఎన్నికల నాటికే. మహిళలను ఓటర్లుగానే చూస్తున్నారు తప్ప వారికి అవకాశాలు ఇవ్వడంలేదు. చిన్నచిన్న పనులు మొదలుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక దిగ్గజ సంస్థల్లో రాణిస్తున్నవారు ఉన్నారు. మేము సైతం అంటూ అన్ని రంగాల్లో సత్తా చాటిన సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. అయితే రాజకీయాల్లో మాత్రం వారిని చిన్నచూపు చూస్తున్నారు. మహిళల పట్ల వివక్ష, అసమానత మిగిలిన రంగాల్లో కంటే రాజకీయ రంగంలో ఎక్కువగా కనిపిస్తోంది. మహిళా సాధికారిత అంటూ వేదికలెక్కి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే రాజకీయ పార్టీలు వారికి టికెట్లు కేటాయించడం, పదవులు ఇవ్వడంపై ఆసక్తి చూపడం లేదు. అసెంబ్లీ సీట్ల కేటాయింపులో ఏ ఒక్క పార్టీ కూడా జిల్లాలో ఒక్క స్థానానికి మహిళ పేరు పరిశీలన చేయకపోవడం గమనార్హం.

పురుష అభ్యర్థులకే టికెట్లు

జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉండగా అధికార బీఆర్‌ఎస్, ప్రతి పక్ష కాంగ్రెస్ అన్ని స్థానాలను పురుష అభ్యర్థులకే కట్టబెట్టారు. బీజేపీ పరిశీలనలో సైతం మహిళల పేర్లు లేకపోవడం గమనార్హం. ఈ పార్టీ తరఫున జిల్లాలో 60 మంది దరఖాస్తులు చేశారు. మహిళలు పార్టీల్లో మహిళా విభాగాలు, మహిళా మోర్చాలకే పరిమితమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల వరకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. కానీ ఏడాది క్రితం వరకు శాసనసభ, పార్లమెంట్ స్థానాలకు రిజర్వేషన్ విధానం అంటూ లేదు. ఇటీవల మహిళా బిల్లుకు చట్టసభల్లో ఆమోదం పొందగా అమలుకు ఇంకా సమయం పట్టనుంది. విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ అమలులో ఉంది. వికారాబాద్ జిల్లాలో 20 మండలాలు, 2.5 లక్షల కుటుంబాలు ఉన్నాయి. 9,34,523 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 4,64,822మంది, మహిళా ఓటర్లు 4,69,659 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కానీ జనాభా ప్రాతిపదికన సీట్లు మాత్రం కేటాయించలేదు.

ఒకే ఒక్క మహిళా ఎమ్మెల్యే

జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఒకే ఒక్కసారి మహిళా ఎమ్మెల్యే ప్రాతినిత్యం వహించారు. పరిగి నియోజకవర్గం నుంచి 1952లో ఎస్‌జే బేగం కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వికారాబాద్ నియోజకవర్గం నుంచి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి, 2004లో తెలుగుదేశం పార్టీ నుంచి రెండు సార్లు దివంగత మాజీ ఎమ్మెల్యే బి.సంజీవరావు సతీమణి మధురవేణికి టికెట్ కేటాయించారు. అయితే ఆమె రెండు సార్లూ స్వల్ప ఓట్లతో ఓటమి పాలయ్యారు. అదే విధంగా వికారాబాద్ నియోజకవర్గం నుంచి 2014 ఎన్నికల్లో బీజేపీ తరఫున మాజీ మంత్రి కొండ్రు పుష్పలీలకు టికెట్ కేటాయించారు. ఆమె కూడా ఓటమిపాలయ్యారు. కంటితుడుపు చర్యగా అసెంబ్లీ సీట్లు కేటాయిస్తున్నారే తప్ప జనాభాకు అనుగుణంగా మహిళలకు సీట్లు కేటాయించడం లేదనేది వాస్తవం. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో భవిష్యత్తులో వారు కూడా రాజకీయ రంగంలో సత్తా చాటే అవకాశం లేకపోలేదు.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు ఇందిరమ్మ రాజ్యం స్థాపించి పేదలకు మేలు చేశారని, అతి త్వరలో అదే తరహా పాలనను తెలంగాణలో తెస్తామని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పట్లూర్, ఘణపూర్, జంషాద్‌పూర్, పట్లూర్ తండా, రామపూర్, కొత్లాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్లు, దళితులకు ఏడు విడతల్లో భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆరోగ్య పథకం పేదలకు కొండంత అండగా నిలిచిందన్నారు. వైఎస్ ఆత్మ తిరిగి రేవంత్‌రెడ్డిలో చేరిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వైఎస్‌ఆర్ ఇందిరమ్మ రాజ్యాన్ని మరోసారి తీసుకొస్తామన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆరోపించారు. తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు. తాను కష్టపడి ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపిస్తే ఆ విశ్వాసం లేకుండా తనను జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి నుంచి తీసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనంద్‌ను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్ మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మర్పల్లి మాజీ ఎంపీపీ నర్సింలు, మండల వర్కింగ్ ప్రసిడెంట్లు రఫీ, సురేష్, ప్రభాకర్, జిల్లా కార్యదర్శి సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా నాయకులు సుభాష్‌యాదవ్, రాములు యాదవ్, ఖలీమొద్దీన్, సురేష్, పట్లూర్ ఎంపీటీసీలు స్వప్న, మంజుల, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు నసీరొద్దీన్, కొత్లాపూర్ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు నాగేశ్, దివాకర్, శేఖర్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పట్లూర్‌లో ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తున్న గడ్డం ప్రసాద్‌కుమార్

తాండూరుకు ఏం చేశావో చెప్పాలి

- మనోహర్‌రెడ్డిపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫైర్
- మండలంలో ఎన్నికల ప్రచారం



కోటబాసుపల్లి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొత్లాపూర్, మల్కాపూర్, సంగెంకలాన్, ఐనెల్లి, జినుగుర్తి, ఉద్దాండపూర్, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ స్థానికేతరుడైన మనోహర్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, ఆయనకు తాండూరు పరిధిలో ఎన్ని ఊర్లు ఉన్నాయో కూడా తెలియదన్నారు. నేను ఇదే నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం ఇందర్‌చెడ్ గ్రామ వాసినని పేర్కొన్నారు. మీ బిడ్డగా అడుగుతున్నా మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. తనను గెలిపిస్తే తాండూరును మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలోని అన్ని పథకాలు అర్హులకు అందేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజుల, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఉమాశంకర్, వైస్ ఎంపీపీ స్వరూప రెడ్డి, సర్పంచులు నాగార్జున, సాయిలు, విజయలక్ష్మి, స్వప్నజ్యోతి, మేఘనాథ్ గౌడ్, రత్నమ్మ, ఎంపీటీసీలు రవిసింధే, నాయకులు రాజప్పగౌడ్, రాంలింగారెడ్డి, గౌడి వెంకటేశం, ప్రదీప్‌రెడ్డి, పండరి, వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



సర్పంచ్‌ చిన్నమ్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్‌ పాలనలో మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో చౌడాపూర్‌ మండలం బొర్రాహెమ్యానాయక్‌ తండాకు చెందిన బీఆర్‌ఎస్‌ సర్పంచ్‌ మూడవత్‌ చిన్నమ్మ, ఆమె అనుచరుడు శ్రీను కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ గాలి వీస్తోందని, భారీ మెజారిటీతో అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ పాలనపై ప్రజలు విరక్తి చెందారని అన్నారు. ఐదేళ్లుగా సర్పంచులు నిధులు లేక అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. చేసిన పనులకు బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు మిత్తీ కట్టలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే సర్పంచులు బీఆర్‌ఎస్‌ వీడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్‌, ఎస్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్‌, ఉపాధ్యక్షుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా నోడల్‌ అధికారి చక్రపాణి



పోలింగ్‌ అధికారులతో మాట్లాడుతున్న చక్రపాణి

తాండూరు: అసెంబ్లీ ఎన్నికలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా నోడల్‌ అధికారి చక్రపాణి అన్నారు. పట్టణంలోని నంబర్‌ 1 పాఠశాలలో పోలింగ్‌ అధికారులు, అసిస్టెంట్‌ పోలింగ్‌ అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తరగతులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రూ.4లక్షలు సీజ్‌

దోమ: మండల పరిధిలోని పాలేపల్లి శివారులో చెక్‌పోస్టు వద్ద బుధవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.4లక్షలు సీజ్‌ చేశారు. మోత్కూర్‌ గ్రామానికి చెందిన మదను మైపాల్‌ అనే వ్యక్తి బైక్‌పై కమలమ్మ, రాములమ్మతో కలిసి దోమ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసులు వీరిని తనిఖీ చేయంగా మహిళల వద్ద రూ. 4లక్షలు ఉన్నట్లు గుర్తించారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్‌ చేశారు.

వికారా‘బాద్‌షా’లు

తెలంగాణ ఊటీగా పేరుగాంచిన వికారాబాద్‌ తొలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిని, నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌ను అందించిన ఘనత నియోజకవర్గం సొంతం. ప్రస్తుతం ప్రత్యేక రాష్ట్రంలో జిల్లా కేంద్రంగా సేవలందిస్తోంది. ఈ సెగ్మెంట్‌లో ఒకప్పుడు కాంగ్రెస్‌, టీడీపీ మధ్య గట్టిపోటీ ఉండగా.. ప్రస్తుతం హస్తం, కారు మధ్య కొనసాగుతోంది. ఎస్సీ రిజర్వ్‌గా ఉన్న ఈ స్థానంలో ముస్లింల ఓట్లు గెలుపోటముల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి.

సీఎం, గవర్నర్‌, మంత్రులను అందించిన నేల

- మర్రి వంశానికి ఇక్కడ నుంచే ఊడలు
- రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక
- తొలిదశ తెలంగాణ ఉద్యమానికి పురుడు
- ఆదిలో హస్తం హవా.. అనంతరం టీడీపీ గాలి
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఏసీఆర్‌ రికార్డు



జంగ్‌ తెలంగాణ



మర్రి చెన్నారెడ్డి



సంజీవరావు



ఏసీఆర్‌



ప్రసాద్‌ కుమార్‌



మెతుకు ఆనంద్‌

వికారాబాద్‌: వికారాబాద్‌ నియోజకవర్గం 1952లో ఏర్పడగా.. మర్రి వంశానికి రాజకీయ బీజాలు ఇక్కడ నుంచే మొదలయ్యాయి. ఉమ్మడి ఏపీకి సీఎంగా.. యూపీ, పంజాబ్‌, రాజస్థాన్‌, తమిళనాడు గవర్నర్‌గా గురుతర బాధ్యతలు చేపట్టడంతో పాటు తొలి తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ప్రజాసమితికి అధ్యక్షుడిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి తొలుత ఇక్కడ నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సెగ్మెంట్‌లో 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఏడు ఎన్నికల్లో కాంగ్రెస్‌ గెలుపొందగా.. నాలుగు సార్లు టీడీపీ జెండా ఎగురవేసింది. మూడుసార్లు కారుకు ఓటేసిన ప్రజలు ఓసారి ఇండిపెండెంట్‌కు సైతం అవకాశం కల్పించారు.

రెండుసార్లు ఏకగ్రీవం

నియోజకవర్గం ఏర్పడిన తొలినాళ్లలో 1952, 1957లలో ఎన్నికలు ఏకగ్రీవమవ్వగా ఈ రెండు పర్యాయాలు నేషనల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఇద్దరు చొప్పున శాసన సభ్యులను నియమించటంతో జిల్లాలో ద్విశాసన సభ్యులున్న నియోజక వర్గంగా చరిత్రకెక్కింది. అత్యధికంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించిన ఎ.చంద్రశేఖర్‌రావు నాలుగు సార్లు టీడీపీ నుంచి ఓసారి టీఆర్‌ఎస్‌ నుంచి గెలుపొందారు. నియోజకవర్గంలో మొదట వికారాబాద్‌, దారూరు, మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేట మండలాలుండేవి. 2009లో జరిగిన పునర్విభజనలో నవాబుపేట చేవెళ్లలో కలవగా బంట్వారం వికారాబాద్‌లో కలిపారు.

ఎనిమిది మందిలో ముగ్గురే స్థానికులు

నియోజకవర్గం ఏర్పడింది మొదలు 15 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా ఎనిమిది మంది ఎమ్మెల్యే పదవిని అధిష్టించారు. 1952, 1957లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని మర్పల్లి మండలానికి చెందిన మర్రి చెన్నారెడ్డి, స్థానికేతరుడైన ఎ.రామస్వామిని కాంగ్రెస్‌ నామినేట్‌ చేసింది. 1962, 1967లలో జరిగిన ఎన్నికల్లో ఎ.రామస్వామి గెలుపొందారు. 1972లలో ఇండిపెండెంట్‌ అభ్యర్థి తిర్మలయ్య సదాలక్ష్మి అనే మహిళపై విజయం సాధించారు. 1978లో తిరిగి సదాలక్ష్మిపైనే తిర్మలయ్య కాంగ్రెస్‌ నుంచి గెలుపొందారు. 1983లో తిర్మలయ్యపై కేఆర్‌కే స్వామి గెలుపొందారు. అనంతరం 1985లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఏ.చంద్రశేఖర్‌ తిర్మలయ్యపై గెలుపొందాడు. ఇలా వరుసగా నాలుగు సార్లు టీడీపీ తరఫున ఓ సారి టీఆర్‌ఎస్‌ తరఫున మొత్తం చంద్రశేఖర్‌ ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటాడు. ఆయన రెండు సార్లు మంత్రి పదవిని సైతం అలంకరించారు. 2008 ఉప ఎన్నికలో 2009 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన గడ్డం ప్రసాద్‌ కుమార్‌ మంత్రి పదవిని చేపట్టి అనతి కాలంలోనే నియోజకవర్గ రాజకీయాల్లో కీలకంగా మారారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి సంజీవరావు చేతిలో, 2018లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థి డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ చేతిలో ఓటమిపాలయ్యారు. నియోజకవర్గ ఏర్పడింది మొదలు వికారాబాద్‌నుంచి మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యే పదవిని చేపట్టగా అందులో మర్రి చెన్నారెడ్డి, తిర్మలయ్య, ఆనంద్‌ తక్కిన వారంతా స్థానికేతరులే.

1952 నుంచి 2014 వరకు ప్రాతినిధ్యం వహించిన అభ్యర్థులు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి
1952	ఎ.రామస్వామి, మర్రి చెన్నారెడ్డి	కాంగ్రెస్‌	ఏక గ్రీవం
1957	ఎ.రామస్వామిమర్రి, చెన్నారెడ్డి	కాంగ్రెస్‌	ఏక గ్రీవం
1962	ఎ.రామస్వామి	కాంగ్రెస్‌	-
1967	ఎ.రామస్వామి	కాంగ్రెస్‌	-
1972	తిర్మలయ్య	ఇండిపెండెంట్‌	సదాలక్ష్మి
1978	తిర్మలయ్య	కాంగ్రెస్‌	సదాలక్ష్మి
1983	కేఆర్‌కే.స్వామి	కాంగ్రెస్‌	తిర్మలయ్య
1985	ఎ.చంద్రశేఖర్‌	టీడీపీ	తిర్మలయ్య
1989	ఎ.చంద్రశేఖర్‌	టీడీపీ	తిర్మలయ్య
1994	ఎ.చంద్రశేఖర్‌	టీడీపీ	తిర్మలయ్య
1999	ఎ.చంద్రశేఖర్‌	టీడీపీ	మధురవేణి
2004	ఎ.చంద్రశేఖర్‌	టీఆర్‌ఎస్‌	సంజీవరావు
2008	జి.ప్రసాద్‌కుమార్‌ ఉప ఎన్నిక	కాంగ్రెస్‌	చంద్రశేఖర్‌
2009	జి.ప్రసాద్‌కుమార్‌	కాంగ్రెస్‌	చంద్రశేఖర్‌
2014	బి.సంజీవరావు	టీఆర్‌ఎస్‌	ప్రసాద్‌కుమార్‌
2018	ఎమ్‌. ఆనంద్‌	టీఆర్‌ఎస్‌	ప్రసాద్‌కుమార్‌

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జండర్స్‌	మొత్తం
వికారాబాద్‌	38970	39462	12	78444
ధారూరు	16872	17143	-	34015
మోమిన్‌పేట	18529	18522	-	37051
మర్పల్లి	22094	21103	01	43198
బంట్వారం	8118	8455	-	16573
కోట్‌పల్లి	7151	7249	-	14400
మొత్తం	111734	111934	13	223681

సంచలనాల ‘కల్వకుర్తి’

కల్వకుర్తి నియోజకవర్గం.. కాకలు తీరిన రాజకీయ ఉద్దండులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్న గడ్డ. మహామహులనే మట్టి కరిపించిన నేల. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989 ఎన్నికల్లో దివంగత ఎన్టీఆర్‌పై పోటీ చేసిన చిత్తరంజన్‌దాస్‌ గెలుపొంది సంచలనం సృష్టించారు. తదనంతరం కాంగ్రెస్‌ ఆయనకు మంత్రి వర్గంలో చోటు కల్పించింది. సూదిని జైపాల్‌రెడ్డిలాంటి గొప్ప నాయకులను అందించిన ఓటర్లు ఈ సెగ్మెంట్‌ సొంతం.

ఎన్టీఆర్‌ను ఓడించిన సెగ్మెంట్‌

- ఎన్నిక ఏదైనా తీర్పు విలక్షణం
- తొమ్మిదిసార్లు హస్తానికే అవకాశం
- అసెంబ్లీ మెట్లెక్కిన ముగ్గురు స్వతంత్రులు
- వరుసగా నాలుగు సార్లు గెలిచిన ‘సూదిని’



లట్టుపల్లి వెంకట్‌రెడ్డి



ద్యాప గోపాల్‌రెడ్డి



చిత్తరంజన్‌దాస్‌



సూదిని జైపాల్‌రెడ్డి



ఎడ్మ కిష్టారెడ్డి



జైపాల్‌యాదవ్‌



వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతీ ఎన్నిక విలక్షణ తీర్పునిస్తుంది. రాష్ట్రానికి, దేశానికి రాజకీయ ఉద్దండులను అందించింది. ఎన్టీఆర్‌ లాంటి మహామహులను ఓడించి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రత్యేకతను సంపాదించుకుంది. ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో తొమ్మిదిసార్లు కాంగ్రెస్‌ అభ్యర్థులు విజయం సాధించగా.. జనతాదళ్‌, స్వతంత్ర అభ్యర్థులు మూడు సార్లు, రెండు సార్లు టీడీపీ నుంచి పోటీచేసిన వారు గెలుపొందారు. ఇక్కడ గెలుపొందిన వారిలో లట్టుపల్లి వెంకట్‌రెడ్డి, జె.చిత్తరంజన్‌దాస్‌లకు మాత్రమే అమాత్యులుగా అవకాశం లభించింది.

రెండు జిల్లాల పరిధిలో సెగ్మెంట్‌

1962లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయింది. ఈ సెగ్మెంట్‌లో ప్రస్తుతం ఆరు మండలాలుండగా జిల్లాల పునర్విభజనలో రెండు జిల్లాల పరిధిలో ఉంది. వెల్దండ, చారకొండ, కల్వకుర్తి మండలాలు నాగర్‌కర్నూల్‌ జిల్లాలో ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి మండలాలు రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి.

17 పర్యాయాలు ఎన్నికలు

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు ఉప ఎన్నికలతో సహా 17 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 62 వరకు ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్నది. 1952 ఎన్నికల్లో జనరల్‌ నుంచి నర్సింగరావ్‌, ఎస్సీ రిజర్వ్‌ నుంచి వీరస్వామి, 1957 ఎన్నికలలో జనరల్‌ నుంచి శాంతాబాయి, ఎస్సీ రిజర్వ్‌ నుంచి నాగన్నలు విజయం సాధించారు.

జైపాల్‌కే జై

నియోజక వర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది దివంగత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌ రెడ్డి రికార్డుకెక్కారు. 1969లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ అభ్యర్థిగా జైపాల్‌రెడ్డి తొలిసారి విజయం సాధించారు. 1972లో కాంగ్రెస్‌ నుంచి, 1978, 1983లో జనతాదళ్‌ నుంచి జైపాల్‌ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఇచ్చిన పార్టీకి.. తెచ్చిన పార్టీకి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్‌, టీఆర్‌ఎస్‌లకు చెరో విజయం అందించారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్‌ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, 2018 ఎన్నికలలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2014 ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ఆచారి కేవలం 72 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు.

అభ్యర్థుల ఖరారు

ప్రస్తుత ఎన్నికలలో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్‌ఎస్‌ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ మరోసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్‌ అభ్యర్థిగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బీజేపీ అభ్యర్థిగా జాతీయ బీసీ కమీషన్‌ మాజి సభ్యులు ఆచారి, బీఎస్పీ అభ్యర్థిగా కొమ్ము శ్రీనివాస్‌ యాదవ్‌లు కల్వకుర్తి బరిలో ఉన్నారు.

ఎన్టీఆర్‌కు చేదు అనుభవం

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావుకు కల్వకుర్తి ఓటర్ల నుంచి చేదు అనుభవం ఎదురైంది. 1989 ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి బరిలో ఉండగా కాంగ్రెస్‌ అభ్యర్థి జె.చిత్తరంజన్‌దాస్‌ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం ఆయనకు హస్తం పార్టీ మంత్రివర్గంలో చోటు కల్పించింది.



గెలుపొందిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
1952	నర్సింగరావ్‌,వీరాస్వామి	కాంగ్రెస్‌
1957	శాంతాబాయి, నాగన్న	కాంగ్రెస్‌
1962	లట్టుపల్లి వెంకట్‌రెడ్డి	స్వతంత్ర
1964	శాంతాబాయి	కాంగ్రెస్‌
1967	ద్యాప గోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1969	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్‌
1972	సూదిని జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్‌
1978	సూదిని జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1983	సూదిని జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1985	చిత్తరంజన్‌దాస్‌	కాంగ్రెస్‌
1989	చిత్తరంజన్‌దాస్‌	కాంగ్రెస్‌
1994	ఎడ్మ కిష్టారెడ్డి	స్వతంత్ర
1999	జైపాల్‌యాదవ్‌	టీడీపీ
2004	ఎడ్మ కిష్టారెడ్డి	కాంగ్రెస్‌
2009	జైపాల్‌యాదవ్‌	టీడీపీ
2014	చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్‌
2018	జైపాల్‌యాదవ్‌	టీఆర్‌ఎస్‌

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కడ్తాల	16576	15443	0	32019
తలకొండపల్లి	18016	17259	2	35277
కల్వకుర్తి రూరల్‌	15074	14672	0	29746
కల్వకుర్తి అర్బన్‌	11902	11864	0	23746
వెల్దండ	15978	5586	1	31565
చారకొండ	3394	3363	0	6757
ఆమనగల్లు	15065	14876	0	29941
మాడ్గుల	21388	20187	4	41579
మొత్తం	117397	113250	7	230650

స్వతంత్రులకు సై..

ఈ నియోజకవర్గం నుంచి ముగ్గురు స్వతంత్రులు విజయం సాధించారు. 1962 ఎన్నికలో తలకొండపల్లి మండలం పడకల్‌ గ్రామానికి చెందిన లట్టుపల్లి వెంకట్‌రెడ్డి, 1967లో మిడ్జిల్‌ మండలం గుడిగానిపల్లికి చెందిన ద్యాప గోపాల్‌రెడ్డి, 1994లో కల్వకుర్తికి చెందిన ఎడ్మ కిష్టారెడ్డి ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసి సత్తాచాటుకున్నారు.



ధారూరు: రాంపూర్‌తండాలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌

‘గులాబీ’ల జెండలమ్మా..

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే అధికార బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించండంతో వారంతా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే జిల్లాలో అధికార పార్టీ పెద్దలు కేటీఆర్‌, హరీశ్‌రావు ఓ దఫా మీటింగ్‌లు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సైతం తమ తమ నియోజకవర్గాలను ఓ రౌండ్‌ చుట్టేశారు. అభ్యర్థుల సతీమణులు తమ భర్తలను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

– వికారాబాద్‌ నెట్‌వర్క్‌



అనంతగిరి: అలంపల్లిలో ప్రచారం చేస్తున్న వికారాబాద్‌ ఎమ్మెల్యే ఆనంద్‌ సతీమణి సబిత





తాండూరు టౌన్‌: పైలట్‌ సతీమణి ఆర్తిరెడ్డి, కొడంగల్‌: వృద్ధురాలితో మాట్లాడుతున్న పీఎన్‌ఆర్‌



దోమ: వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి